

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి ఆదివారం 11-10-2026 సంపుటి: 02 సంచిక : 161 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Sunday 11-10-2026 Volume :02 Issue: 161 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777




### అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు

# ప్రారంభం

- రవీంద్రభారతిలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు
- హాజరైన మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్
- బతుకమ్మ పాటలతో మార్మోగిన ప్రాంగణం
- రంగురంగుల పూలు పేర్చి.. మహిళల ఆటపాటలు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు రవీంద్రభారతిలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు వందలాది మంది మహిళలు తరలివచ్చారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. బతుకమ్మ పాటలతో రవీంద్రభారతి ప్రాంగణం మార్మోగింది. ప్రారంభ వేడుకలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ

-మిగతా 2 లో

**ఎల్‌నినో ముప్పు..** అప్రమత్తంగా

# ఉండండి!

### రాబోయే ఎనిమిది నెలలు కీలకం..

- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలపై ముందస్తు కార్యాచరణ
- చుక్క నీరు వృథా కాకుండా పకడ్బందీ చర్యలు
- రైతుల పంటలు చేతికొచ్చే వరకు నీటి కొరత రాకూడదు
- ప్రజల్లో అవగాహనకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కార్యక్రమాలు
- పరిస్థితుల పర్యవేక్షణకు వార్‌రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు



హైదరాబాద్:

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రమయ్యే అవకాశాల నేపథ్యంలో ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాబోయే ఎనిమిది నెలలు కీలకమని, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి,

-మిగతా 2 లో



02

## నేను రెడీ.. అఖిలేశ్ రెడీనా?

- అయోధ్య బరిలో అఖిలేశ్‌తో నేరుగా తలపడేందుకు యోగి సవాల్
- అఖిలేశ్ సిద్ధమైతే తానూ సిద్ధమేనని సీఎం ప్రకటన
- రాజ్యసభ సీట్ల కేటాయింపుపై సమాజ్‌వాదీ పార్టీకి యోగి చురకలు
- వెనుకబడిన వర్గాలు, దళితులకు అవకాశమివ్వలేదని విమర్శ
- గత పాలనలో యువతకు ఉద్యోగాలు, రైతులకు భరోసా కరువయ్యాయని ఆరోపణ
- అయోధ్య అభివృద్ధితోపాటు వచ్చే ఎన్నికల్లో 80 శాతం సీట్లు ఎన్డీయేకే వస్తాయని ధీమా



02

## ఎంతమంది పోలీసులనైనా తెచ్చుకోండి.. భయపడం!

- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సవాల్
- 10 వేలైనా.. 30 వేలైనా వెనక్కి తగ్గబోమని ప్రకటన
- విద్యార్థులు, నాయకులను అరెస్టు చేసినా పోరాటం ఆగదని స్పష్టీకరణ
- యువత పోరాటాలను కొనసాగించాలని పిలుపు
- రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారిని గద్దె దించుతామని వ్యాఖ్య
- ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేసిన కాంగ్రెస్ అగ్రనేత

# నేడు భారత్, వెస్టిండీస్ మూడో టీ20

- బ్యాటర్లకు అనుకూలంగా పిచ్.. బౌలర్లకు కఠిన పరీక్ష
- భారీ లక్ష్యాన్ని ఛేదించి జోరుమీదున్న కరీబియన్లు
- ఫామ్‌లోకి వచ్చిన శ్రేయస్, సంజు శాంసన్
- ఫీల్డింగ్‌లో తప్పిదాలు సరిదిద్దుకోవాల్సిన భారత్
- మయాంక్ వేగంపై గంభీర్ ప్రత్యేక సూచనలు

ఇండోర్

పరుగుల వేటలో దూసుకుపోతున్న భారత్, వెస్టిండీస్ జట్లు మూడో టీ20కి సిద్ధమయ్యాయి. ఆదివారం ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో జరిగే ఈ పోరులోనూ భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్, చిన్న బౌండరీలు బ్యాటర్లకు కలిసిరానుండటంతో బౌలర్లకు మరోసారి సవాలు ఎదురుకానుంది. రాంచీలో జరిగిన రెండో టీ20లో ఇరు జట్లు

-మిగతా 2 లో



**విమానంలోనే సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ అరెస్ట్.**

# అట్టుడికిన ఢిల్లీ

- సీఈసీ రాజీనామా, ఓటరు జాబితా సవరణ ఉపసంహరణకు సీజేపీ ఆందోళన
- జంతర్‌మంతర్ చేరకముందే నేతలు, కార్యకర్తల అరెస్టులు
- ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లో గృహనిర్బంధం చేసిన పోలీసులు
- మమతా బెనర్జీ, కేజ్రీవాల్ సహా పలువురు ప్రముఖుల అదుపులోకి
- దాదాపు 7 వేల మందిని అరెస్టు చేసినట్లు సమాచారం
- న్యాయవాదులు, జర్నలిస్టులనూ నిర్బంధించారన్న ఆరోపణలు
- సొంత ప్రజలపైనే కేంద్రం యుద్ధం ప్రకటించింది: కాంగ్రెస్
- ఇది అప్రకటిత ఎమర్జెన్సీ.. 24 గంటల్లో విడుదల చేయాలి: వాంగ్చుక్
- ఇది ఫ్లాప్ షో' అంటూ బీజేపీ కామెంట్.

నిరసనకారులు జంతర్ మంతర్ చేరకుండా ఎక్కడికక్కడే అరెస్టు.

న్యూఢిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీజేపీ చేపట్టిన ఆందోళనతో దేశ రాజధాని అట్టుడికింది. నిరసనకారులు జంతర్‌మంతర్‌కు చేరకముందే పోలీసులు పలుచోట్ల అడ్డుకుని నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. సుమారు 7 వేల మందిని నిర్బంధించినట్లు వార్తలు వెలువడగా, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు ప్రముఖ నేతలపైనా పోలీసుల చర్యలు చర్చనీయాంశమయ్యాయి. వార్తలు సేకరిస్తున్న జర్నలిస్టులను కూడా నిర్బంధించారన్న ఆరోపణలు రావడంతో వివాదం మరింత ముదిరింది. ఈ చర్యలను అప్రకటిత అత్యవసర పరిస్థితిగా అభివర్ణించిన సోనమ్ వాంగ్చుక్.. నిర్బంధితులను 24 గంటల్లో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు సీజేపీ ఆదివారం కూడా నిరసనలు కొనసాగిస్తామని ప్రకటించడంతో ఢిల్లీలో ఉద్రిక్తతలు కొనసాగే పరిస్థితి నెలకొంది.

**నేడు మరోసారి నిరసనలకు సీజేపీ పిలుపు**





02





## ఎక్కడున్నా మూలాలు మర్చిపోవద్దు

- ప్రవాస తెలంగాణ ప్రజలకు మంత్రి సీతక్క పిలుపు
- దక్షిణాఫ్రికాలో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం
- భావితరాలకు పండుగల గొప్పదనం పరిచయం చేయాలి
- తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి బతుకమ్మ ఆడిన సీతక్క
- ప్రవాసుల మధ్య ఐక్యతను పెంచే వేడుకలు



హైదరాబాద్,

ఎక్కడ నివసిస్తున్నా తెలంగాణ మూలాలను, సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోవద్దని మంత్రి సీతక్క సూచించారు. విదేశాల్లో ఉంటున్న తెలంగాణ ప్రజలు తమ పండుగలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాలో సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. అక్కడ నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి బతుకమ్మ ఆడి, పాటలు పాడారు. ఇలాంటి వేడుకలు విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతోపాటు,

-మిగతా 2 లో

## నాకు ఎనిమిది నోబెల్ బహుమతులు రావాల్సింది!

- శాంతి పురస్కారం దక్కకపోవడంపై ట్రంప్ అసంతృప్తి
- నోబెల్ కమిటీ, నార్వేపై అమెరికా అధ్యక్షుడి విమర్శలు
- ఎనిమిది యుద్ధాలు ఆపానంటూ వ్యాఖ్యలు
- భారత్-పాక్ యుద్ధాన్ని నివారించానని వెల్లడి
- నోబెల్ ఎంపికపై తీవ్ర అసహనం
- ఇరాన్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలపైనా ట్రంప్ వ్యాఖ్యలు



02



## కేసీఆర్ వల్లే ప్రగతిపథంలో తెలంగాణ

- సిద్దిపేట ప్రజలు కేసీఆర్‌ను గెలిపించడం వల్లే తెలంగాణ.. జిల్లా సాకారం
- పదేండ్ల ప్రగతి పండుగ సిద్దిపేట ప్రజలకే అంకితం
- సిద్దిపేట దశాబ్ది ఉత్సవాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట,

'నాడు సమైక్య పాలనలో తెలంగాణ ఉద్యమ జెండా ఎత్తిన కేసీఆర్‌ని నిలబెట్టి గెలిపించింది సిద్దిపేట గడ్డ.. ఆనాడు మీరు కేసీఆర్‌ని గెలిపించడం వల్లే తెలంగాణ వచ్చింది, స్వరాష్ట్రం సిద్ధించడం వల్లే జిల్లా ఏర్పాటై ఇంతటి అభివృద్ధి సాధ్యమైంది. ఈ అభివృద్ధి అంతా సిద్దిపేట మట్టి గొప్పతనం, ప్రజల గొప్పతనం.. అందుకే ఈ పదేండ్ల ప్రగతి పండుగను సిద్దిపేట ప్రజలకే సగర్వంగా అంకితం చేస్తున్నాను. కేసీఆర్ ఆశీస్సులు..



-మిగతా 2 లో

# అట్టుడికిన ఢిల్లీ

-సీఈసీ రాజీనామా, ఓటరు జాబితా సవరణ ఉపసంహరణకు సీజేపీ ఆందోళన

-జంతర్‌మంతర్ చేరకముందే నేతలు, కార్యకర్తల అరెస్టులు

-ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లో గృహనిర్బంధం చేసిన పోలీసులు

-మమతా బెనర్జీ, కేజ్రీవాల్ సహా పలువురు ప్రముఖుల అదుపులోకి

-దాదాపు 7 వేల మందిని అరెస్టు చేసినట్లు సమాచారం

-న్యాయవాదులు, జర్నలిస్టులనూ నిర్బంధించారన్న ఆరోపణలు

-సొంత ప్రజలపైనే కేంద్రం యుద్ధం ప్రకటించింది: కాంగ్రెస్

-ఇది అప్రకటిత ఎమర్జెన్సీ.. 24 గంటల్లో విడుదల చేయాలి: వాంగ్చుక్

-ఇది ఫ్లాప్ షో' అంటూ బీజేపీ కామెంట్.

-నేడు మరోసారి నిరసనలకు సీజేపీ పిలుపు





న్యూఢిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఉపసంహరణ డిమాండ్లతో సీజేపీ శనివారం చేపట్టిన నిరసనతో దేశ రాజధాని అట్టుడికింది. ఆందోళనకారులు జంతర్‌మంతర్‌కు చేరకుండా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. నగరవ్యాప్తంగా భారీగా పోలీసు, పారామిలటరీ బలగాలను మోహరించి ముందస్తు అరెస్టులకు దిగారు. సుమారు 25 వేల మందికి పైగా భద్రతా సిబ్బందిని రంగంలోకి దించినట్లు సమాచారం. పలువురు రాజకీయ నేతలు, విద్యార్థి నాయకులు, సామాజిక కార్యకర్తలు సహా దాదాపు 7 వేల మందిని అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ చర్యలపై సీజేపీ, ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ముంబై నుంచి ఢిల్లీకి చేరుకున్న విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతోపాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను కూడా నిర్బంధించారు. ప్రధాన నిర్వాహకుడు ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లోని ఆయన నివాసంలో గృహనిర్బంధం చేసినట్లు సమాచారం. విమానం ఢిల్లీలో దిగిన వెంటనే పోలీసులు లోపలికి ప్రవేశించి తమ నాయకులను అదుపులోకి తీసుకున్నారని సీజేపీ కార్యకర్తలు ఆరోపించారు. తమ నేతలను నేరస్తుల మాదిరిగా వ్యవహరిస్తూ నిర్బంధించారని దీప్కే విమర్శించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలోనూ ఇలాంటి పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. తాను అరెస్టయినా జంతర్‌మంతర్ వద్ద నిరసనకు అజింక్య శిందే నాయకత్వం వహిస్తారని, నాయకులు లేకున్నా దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతాయని ముందుగా విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు. మరోవైపు జంతర్‌మంతర్, కన్నాట్ ప్లేస్, మింటో బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. జంతర్‌మంతర్‌కు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన పలువురు న్యాయవాదులను కూడా అదుపులోకి తీసుకున్నారు. సుప్రీంకోర్టు నుంచి ర్యాలీగా బయలుదేరిన న్యాయవాదులను పోలీసులు అడ్డుకోవడంపై బార్ అసోసియేషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సీజేపీ జోక్యంతో సుమారు 60 మంది న్యాయవాదులను విడుదల చేసినట్లు సమాచారం. ఐఎన్ఏ మార్కెట్ సమీపంలో ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరా, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ జంతర్‌మంతర్‌కు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఆయనతోపాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ విభాగం నేత సౌరభ్ భరద్వాజ్, పలువురు ఎమ్మెల్యేలను అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. యువత నిరంకుశత్వానికి భయపడబోదని, ఓటరు జాబితా సవరణ అంశంపై సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీతోపాటు ఎంపీలు డెరెక్ ఓబ్రియెన్, దోలా సేన్ తదితరులను పోలీసులు నిర్బంధించారు. చండీగఢ్‌లో ఆప్ చేపట్టిన నిరసనలో మనీష్ సిసోడియా సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శ్రీనగర్‌లోనూ నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ నేతల ర్యాలీలను పోలీసులు అడ్డుకున్నారు. ముంబైలోనూ నిరసనలకు సంబంధించి పలువురిని పోలీసులు నిర్బంధించినట్లు వార్తలు వచ్చాయి. ఆందోళనల సందర్భంగా వార్తలు సేకరిస్తున్న జర్నలిస్టులను కూడా పోలీసులు నిర్బంధించారనే ఆరోపణలు వచ్చాయి. ప్రెస్ గుర్తింపు కార్డులు చూపించినప్పటికీ తమను వాహనాల్లోకి ఎక్కించారని, కొందరి నుంచి అధికారిక పరికరాలను స్వాధీనం చేసుకున్నారని పలువురు విలేకరులు పేర్కొన్నారు. ఈ పరిణామాలపై సామాజిక మాధ్యమాల్లోనూ విమర్శలు వెల్లువెత్తాయి. ఈ అరెస్టులపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. సొంత ప్రజలపైనే కేంద్రం యుద్ధం ప్రకటించినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించింది. మరోవైపు సీజేపీ నిరసనను బీజేపీ 'ఫ్లాప్ షో'గా అభివర్ణించినట్లు సమాచారం. విదేశీ శక్తులతో సీజేపీ కుమ్మక్కయిందని నవీన్ ఆరోపించారు. నిరసనకారుల అరెస్టులపై ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ తీవ్రంగా స్పందించారు. దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి నెలకొన్నట్లుగా ఉందని విమర్శించారు. నిర్బంధంలో ఉన్న కార్యకర్తలను 24 గంటల్లో విడుదల చేయకపోతే లేహ్‌లో లేదా ఢిల్లీలో మరోసారి నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు సీజేపీ ఆదివారం కూడా నిరసనలు కొనసాగించనున్నట్లు ప్రకటించడంతో ఢిల్లీలో ఉద్రిక్తతలు కొనసాగనున్నాయి.

# అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభం

(మొదటి తరువాయి)

శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి ప్రసాదించిన పూలను దేవతగా కొలిచే అపురూపమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ఐక్యతా భావానికి ఈ పండుగ నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రులు ఆకాంక్షించారు. తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లింది, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణీప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్పర్సన్ వెన్నెల గద్దర్‌తోపాటు పలువురు కార్పొరేషన్ చైర్ పర్సన్లు, తదితరులు పాల్గొన్నారు.

లలిత కళా తోరణంలో బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి బతుకమ్మ పండుగ వేడుకలు నగరంలో సందడిగా సాగుతున్నాయి. పబ్లిక్ గార్డెన్లోని లలిత కళా తోరణంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ సమర్పణలో ప్రత్యేకంగా రూపొందించిన బతుకమ్మ పాటలను మంత్రులు ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పేలా ఈ పాటలను రూపొందించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణీప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఎంతమంది పోలీసులనైనా తెచ్చుకోండి.. భయపడం!

-ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సవాల్

-10 వేలైనా.. 30 వేలైనా వెనక్కి తగ్గబోమని ప్రకటన

-విద్యార్థులు, నాయకులను అరెస్టు చేసినా పోరాటం ఆగదని స్పష్టీకరణ

-యువత పోరాటాలను కొనసాగించాలని పిలుపు

-రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారిని గద్దె దించుతామని వ్యాఖ్య

-ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేసిన కాంగ్రెస్ అగ్రనేత



న్యూఢిల్లీ

ఎంతమంది పోలీసులను రంగంలోకి దించినా తాము భయపడబోమని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి సవాల్ విసిరారు. విద్యార్థులు, నాయకులను అరెస్టు చేసినా తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. నిరసనలను అణచివేసేందుకు భారీగా పోలీసులను మోహరించినా వెనక్కి తగ్గేది లేదని పేర్కొన్నారు. 'మోదీజీ.. ఎంతమంది పోలీసులనైనా తెచ్చుకోండి. 10 వేల మంది, 20 వేల మంది, 30 వేల మంది వచ్చినా మేం భయపడం. విద్యార్థులను, నాయకులను అందరినీ అరెస్టు చేయండి. అయినా మా పోరాటం ఆగదు. మిమ్మల్ని చుట్టుముడుతున్నాం' అని రాహుల్ వ్యాఖ్యానించారు. దేశ యువత చేస్తున్న పోరాటాన్ని చూసి గర్విస్తున్నానని పేర్కొంటూ, వారు తమ ఆందోళనలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. యువతకు అండగా తామంతా ఉన్నామని భరోసా ఇచ్చారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారిని అధికార పీఠం నుంచి దించేవరకు పోరాటం కొనసాగిస్తామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# నేను రెడీ.. అఖిలేశ్ రెడీనా?

-అయోధ్య బరిలో అఖిలేశ్‌తో నేరుగా తలపడేందుకు యోగి సవాల్

-అఖిలేశ్ సిద్ధమైతే తానూ సిద్ధమేనని సీఎం ప్రకటన

-రాజ్యసభ సీట్ల కేటాయింపుపై సమాజ్‌వాదీ పార్టీకి యోగి చురకలు

--వెనుకబడిన వర్గాలు, దళితులకు అవకాశమివ్వలేదని విమర్శ

-గత పాలనలో యువతకు ఉద్యోగాలు, రైతులకు భరోసా కరువయ్యాయని ఆరోపణ

-అయోధ్య అభివృద్ధితోపాటు వచ్చే ఎన్నికల్లో 80 శాతం సీట్లు ఎన్డీయేకే వస్తాయని ధీమా



న్యూఢిల్లీ

దమ్ముంటే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అయోధ్య నుంచి పోటీ చేయాలన్న సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సవాల్‌ను యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వీకరించారు. అఖిలేశ్ యాదవ్ కూడా అయోధ్య నుంచి బరిలోకి దిగి తనపై గెలువాలని ప్రతి సవాల్ విసిరారు. ఇద్దరి మధ్య నేరుగా పోటీ జరగాలని కండిషన్ పెట్టారు. అందుకు అఖిలేష్ రెడీ అయితే తానూ రెడీ అని చెప్పారు. శనివారం బలరాంపూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న యోగి ఈ వ్యాఖ్యలు చేశారు. సమాజ్‌వాదీ పార్టీకి కుటుంబం గురించి తప్ప మరో ఆలోచన లేదని ఎద్దేవాచేశారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ ఇద్దరు అభ్యర్థులను బరిలోకి దింపిందని చెప్పారు. వారిలో అఖిలేశ్ బాబాయి రామ్ గోపాల్ యాదవ్ ఒకరని, మరో సీటును పారిశ్రామికవేత్త ధన్‌రాజ్ పరిమల్ నత్వానీకి కేటాయించారని విమర్శించారు. వెనుకబడిన వర్గాలు, దళితులు, బ్రాహ్మణులు సహా ఇతర వర్గాలకు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ చెప్పే 'పీడీఏ' కు కుటుంబ అభివృద్ధి సంస్థ, రాష్ట్రాన్ని ముంచే కూటమి అని కొత్త అర్థాలు చెబుతూ యోగి విమర్శలు గుప్పించారు. గతంలో సమాజ్‌వాదీ పార్టీ పాలనలో యువతకు ఉద్యోగాలు రాలేదని, రైతులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. అయోధ్యలో గతంలో రోజుకు మూడు, నాలుగు గంటలే విద్యుత్ సరఫరా ఉండేదని, పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉండేవని యోగి అన్నారు. ఇప్పుడు నగరం రామరాజ్యానికి ఉదాహరణగా నిలుస్తోందని యోగి చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 80 శాతం సీట్లు ఎన్డీయే గెలుస్తుందని యోగి ధీమా వ్యక్తంచేశారు. మిగిలిన సీట్లు ఇతర పార్టీలకు వెళ్లినా బలరాంపూర్ అభివృద్ధి ఆగదని చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై జరుగుతున్న నిరసనలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు హద్దులు దాటి వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

# ఎక్కడున్నా మూలాలు మర్చిపోవద్దు

(మొదటి తరువాయి)



తమ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడానికి దోహదపడతాయని సీతక్క తెలిపారు. బతుకమ్మ వంటి పండుగలు తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకలని పేర్కొన్నారు. విదేశాల్లోనూ సంప్రదాయాలను కొనసాగిస్తూ, పుట్టిన నేలతో అనుబంధాన్ని కాపాడుకోవడం గొప్ప విషయమని ఆమె అన్నారు.

# ఎల్‌నినో ముప్పు.. అప్రమత్తంగా ఉండండి!

(మొదటి తరువాయి)

ప్రతి కార్యాచరణలో వారిని భాగస్వాములను చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత తీవ్రతరమయ్యే ప్రమాదం ఉందని సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర అవసరాల కోసం విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నప్పటికీ, మార్కెట్‌లో తగినంత విద్యుత్ అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంపై సినిమా, మీడియా, కళాజాతాలు తదితర మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రైతులు సాగు చేసిన పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, పంటలు చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రమవకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తక్షణ సహాయక చర్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో కరువు మండలాల ప్రకటనతో పాటు తగిన ఆర్థిక సాయం అందించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరినట్లు తెలిపారు. వి.బి.-జీ రామ్ జీ పథకం కింద ప్రస్తుతం కల్పిస్తున్న 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల పని కల్పించాలని కేంద్రాన్ని కోరేందుకు సిద్ధం కావాలని అధికారులకు సూచించారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం నిర్వహించే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ సరఫరాపై ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. దసరా తర్వాత గ్రామం నుంచి మండలం, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమీక్షలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ వల్లే ప్రగతిపథంలో తెలంగాణ

(మొదటి తరువాయి)

ప్రజల దీవెనలతో ఈ స్థాయిలో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నా. చరిత్ర ఉన్నంతవరకు సిద్దిపేటలో చేసిన అభివృద్ధి పనులు నిలబడి ఉంటాయి. దేశంలో ఎకడికి వెళ్లినా సిద్దిపేట వాళ్లమంటే గౌరవం దకేలా అభివృద్ధి చేశాను' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేండ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం విపంచి కళానిలయంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, ఆయాచితం శ్రీధర్, జర్నలిస్టు నాయకుడు విరాహత్ అలీ, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితర నేతలతో కలిసి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిద్దిపేట సాహిత్య వైభవం, స్వరాష్ట్రంలో సాధించిన గుణాత్మక మార్పులు, భవిష్యత్తు ప్రణాళికలు వివరించారు. అనంతరం వర్తక, వాణిజ్య, వ్యాపార, వైశ్య సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో, రూబీ నెక్లెస్ రోడ్డు కోమటి చెరువు వద్ద ఫుడ్ ఫెస్టివల్‌తోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సిద్దిపేట మీదుగా ఉత్తర భారతానికి రైళ్లు నడవనున్నాయని చెప్పారు. హైదరాబాద్ నుంచి సిద్దిపేట మీదుగా దక్షిణ భారతానికి ప్రతి అరగంటకు ఒక రైలు నడుస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో రైస్ మిల్లులపై అధికారుల దాడులు జరుగలేదని గుర్తుచేశారు.౦

## నాకు ఎనిమిది నోబెల్ బహుమతులు రావాల్సింది!

న్యూఢిల్లీ: ఈ ఏడాది కూడా నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను ఇప్పటివరకు ఎనిమిది యుద్ధాలను ఆపానని, ప్రతి యుద్ధానికి ఒక్కో పురస్కారం ఇచ్చినా తనకు ఎనిమిది నోబెల్ శాంతి బహుమతులు రావాల్సిందని వ్యాఖ్యానించారు. సిరాక్యూస్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో మాట్లాడిన ఆయన నోబెల్ కమిటీ, నార్వేపై విమర్శలు గుప్పించారు. అమెరికా అధ్యక్షుడిగా తాను శాంతి కోసం చేసిన ప్రయత్నాలను గుర్తించకపోవడం నార్వేకు శాశ్వత మచ్చగా మిగిలిపోతుందని అన్నారు. నోబెల్ శాంతి బహుమతి ఎంపిక చేసిన విధానంపై ట్రంప్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్ణయం తీసుకున్నవారు అవమానకరమైన పని చేశారని, నోబెల్ కమిటీలో ఉన్నవారు ప్రజాస్వామ్య వ్యతిరేకులంటూ విమర్శించారు. పురస్కారం అందుకున్న నవీ పిళ్లై గురించి తనకు ఇంతకుముందు తెలియదని వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితిలో పనిచేసే ఉదారవాద వ్యక్తికి బహుమతి ఇచ్చారని ఎద్దేవా చేస్తూనే, ఆమెకు అభినందనలు తెలిపారు. తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎనిమిది యుద్ధాలను ఆపానని ట్రంప్ మరోసారి చెప్పుకున్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం జరగకుండా నివారించి సుమారు ఐదు కోట్ల మంది ప్రాణాలను కాపాడానని పేర్కొన్నారు. ఇరాన్ అణుబాంబును సంపాదించకుండా అడ్డుకోవడం ద్వారా పశ్చిమాసియా, యూరప్, అమెరికాకు ఎదురయ్యే ప్రమాదాన్ని తప్పించానని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఇరాన్ సంఘర్షణతో పాటు రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని కూడా త్వరలో ముగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

# నేడు భారత్, వెస్టిండీస్ మూడో టీ20

(మొదటి తరువాయి)

కలిపి 501 పరుగులు చేయగా, భారత్ నిర్దేశించిన 250 పరుగుల లక్ష్యాన్ని వెస్టిండీస్ మరో ఓవర్ మిగిలుండగానే ఛేదించింది. ఈ నేపథ్యంలో భారత బౌలర్లు ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయడంపై దృష్టి పెట్టాల్సి ఉంది. రాంచీ మ్యాచ్‌లో ఫీల్డింగ్ తప్పిదం భారత్ విజయావకాశాలను దెబ్బతీసింది. మయాంక్ యాదవ్ జారవిడిచిన క్యాచ్‌ను సద్వినియోగం చేసుకున్న షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ 37 బంతుల్లో 84 పరుగులతో చెలరేగాడు. షాయ్ హోప్ కూడా అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో వెస్టిండీస్ బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. ఈ పర్యటనలో ఇప్పటికే రెండు సెంచరీలు సాధించిన హోప్‌ను త్వరగా ఔట్ చేయడం భారత్‌కు కీలకం కానుంది. క్యాచ్‌లను అందిపుచ్చుకోవడంతో పాటు ప్రత్యర్థి బ్యాటర్ల భాగస్వామ్యాలను విడదీయడంపై భారత జట్టు ప్రత్యేక దృష్టి సారించాలి. భారత్‌కు మాత్రం శ్రేయస్ అయ్యర్, సంజు శాంసన్ ఫామ్‌లోకి రావడం ఊరటనిస్తోంది. రాంచీ మ్యాచ్‌లో శ్రేయస్ 102 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, సంజు 41 బంతుల్లో 82 పరుగులు సాధించాడు. వీరిద్దరూ ఇదే జోరును కొనసాగిస్తే భారత బ్యాటింగ్ మరింత బలపడుతుంది. మరోవైపు తుది జట్టు కూర్పుపై ఆసక్తి నెలకొంది. పరిస్థితులకు అనుగుణంగా మధ్య వరుసలో ఆటగాళ్ల స్థానాలను మార్చే అవకాశం ఉందని కోచ్ గౌతమ్ గంభీర్ సంకేతాలిచ్చాడు. బౌలింగ్‌లో అర్ష్‌దీప్ సింగ్ మెరుగుపడాల్సి ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో అతడు 79 పరుగులు ఇచ్చి ఒక వికెట్ మాత్రమే తీశాడు. మయాంక్ యాదవ్ మాత్రం వేగవంతమైన బంతులతో ఆకట్టుకుంటున్నాడు. రెండు మ్యాచ్‌ల్లో మూడు వికెట్లు పడగొట్టిన మయాంక్‌కు గంభీర్ కీలక సూచనలు చేశాడు. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయగలిగితే అదే సహజ బలాన్ని కొనసాగించాలని, అనవసర ప్రయోగాలకు దూరంగా ఉండాలని సూచించాడు. రెండో టీ20లో హెట్మయర్ వికెట్ తీసిన బంతి గంటకు 144.5 కిలోమీటర్లు, పావెల్ వికెట్ తీసిన బంతి 149.5 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లోనూ మయాంక్ తన వేగాన్ని కొనసాగిస్తాడా, భారత బౌలర్లు పరుగుల ప్రవాహాన్ని అడ్డుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది.

RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక

# ప్రజాస్వామ్య పరిరక్షణకు బీఆర్ఎస్ పోరుబాట

- సర్ ప్రక్రియపై అభ్యంతరాలు.. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారంటూ నిరసన
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన





**ఎల్బీనగర్, అక్టోబర్ 10 (నేటి దర్శిని):** ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు ఎల్బీనగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారంటూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, జవాబుదారీతనం పాటించాలని డిమాండ్ చేశారు.

**ఓటర్ల జాబితాపై అనుమానాలు తొలగించాలి**

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు వేసే అవకాశం కల్పించడం ఎన్నికల వ్యవస్థ బాధ్యత అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరిపి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియపైనా కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సర్ ప్రక్రియ ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు వినియోగంపై వ్యక్తమవుతున్న అనుమానాలను కూడా అధికారులు నివృత్తి చేయాలని నాయకులు కోరారు.

**శాంతియుత నిరసన హక్కును గౌరవించాలి**

భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అణచివేయడం, ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిని నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజలు, విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వాలు గౌరవించాలని అన్నారు. దేశ రాజధానిలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు, రవాణాకు అంతరాయాలు ఏర్పడినట్లు వచ్చిన సమాచారంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటార్సీ--భోపాల్ ప్రాంతాల్లో విద్యార్థులు, ప్రయాణికులు ఎదుర్కొన్న ఇబ్బందులపై స్పందిస్తూ, నిరసనల్లో పాల్గొన్న తెలంగాణ విద్యార్థులను నిర్బంధిస్తే వారిని క్షేమంగా స్వరాష్ట్రానికి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య నిరసనల్లో పాల్గొనే వారిపై దేశద్రోహులు, విదేశీ గూఢచారులు అంటూ ముద్రలు వేయడం సరికాదని నాయకులు పేర్కొన్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన పాలకులు నిరసనలను అడ్డుకోవడంపై దృష్టి సారించడం ఏమిటని ప్రశ్నించారు.

**అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నాయంటూ విమర్శలు**

1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోయిందని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రజల హక్కులు, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుత నిరసనలపై ఆంక్షలు విధిస్తున్నారనే ఆరోపణలు అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులను తలపిస్తున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే నిరంకుశ పోకడలను తమ పార్టీ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

**ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలి**

ఓటర్ల జాబితాపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కూడా కోరారు. నిర్బంధాలతో ప్రజల ఆగ్రహాన్ని ఆపలేరని, ఓటు హక్కు, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుత నిరసన ప్రజాస్వామ్యానికి కీలకమైన పునాదులని నాయకులు పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను, ప్రజల హక్కులను పరిరక్షించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఓటు హక్కు పరిరక్షణకు సంఘీభావం ప్రకటించారు.

# రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఎన్నికల హామీలు అమలు చేయాలి: ఎన్నం సత్యనారాయణ గుప్తా



**మిడ్జిల్, అక్టోబర్ 10( నేటి దర్శిని):** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17,200 మంది రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించి, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్నం సత్యనారాయణ గుప్తా కోరారు. డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ ఇవ్వడంతో పాటు అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పింఛన్లు, హెల్త్ కార్డులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి మండల కేంద్రంలో సంఘ భవనానికి 300 గజాల స్థలం కేటాయించాలని, డీలర్ మరణిస్తే అంత్యక్రియలకు రూ.20 వేల సాయం, కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందించాలని కోరారు. రేషన్ దుకాణాల అద్దెను ప్రభుత్వమే చెల్లించాలని పేర్కొన్నారు. కరోనా సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన డీలర్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఎన్నికల హామీలను నెరవేర్చి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని సత్యనారాయణ గుప్తా కోరారు.

# మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కసిరెడ్డికి శరన్నవరాత్రోత్సవాల ఆహ్వానం

- మార్కండేయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు




**ఆమనగల్లు, అక్టోబర్ 10 (నేటి దర్శిని):** ఆమనగల్లు పట్టణంలోని శ్రీరాజరాజేశ్వర సమేత శివభక్త మార్కండేయ దేవాలయంలో నిర్వహించనున్న రాజరాజేశ్వరి దేవి శరన్నవరాత్రోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ మార్కండేయ యువజన సంఘం నాయకులు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని వారి నివాసాలకు వెళ్లిన సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాల ఆహ్వాన కరపత్రాలను అందజేశారు. ఆమనగల్లు మార్కండేయ దేవాలయంలో పది రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, శరన్నవరాత్రోత్సవాల విశేషాలను వారికి వివరించారు. అనంతరం ఉత్సవాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ యువజన సంఘం నాయకులు ఎంగలి శ్రీధర్, గుద్దేటి మహేష్, శివ, గుర్రం దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నోముల భగత్ జన్మదిన వేడుకలు

- సాగర్‌లో బీఆర్ఎస్ బలప్రదర్శన.. భగత్ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్‌పై నేతల ఫైర్!
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కుర్చీ ం మడత పెడతాం'..
- కొండలను తవ్వి ఎలకను తీసినట్టుగా నియోజకవర్గాన్ని దోచుకున్నారని విమర్శలు



**తిరుమలగిరి సాగర్, అక్టోబర్ 10 (నేటి దర్శిని):** నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నోముల భగత్ కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించాయి. మండల పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ బైక్ ర్యాలీ చేపట్టి, కేక్ కట్ చేసి భగత్ కుమార్‌కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు పిడిగం నాగయ్య ముదిరాజ్ మాట్లాడుతూ, నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధిలో దివంగత నోముల నరసింహయ్య, ఆయన కుమారుడు నోముల భగత్ కుమార్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ భగత్ కుమార్ నాయకత్వంలోనే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన నాయకత్వంలో ఐక్యంగా పనిచేస్తూ ముందుకు సాగుతారని తెలిపారు. రాబోయే రోజుల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతమవుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన సమాధానం చెబుతారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి బీఆర్ఎస్ విజయానికి కార్యకర్తలు కృషి చేస్తారని వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూ, కొండలను తవ్వి ఎలుకను తీసిన చందంగా పాలన సాగుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కేతావత్ బిక్ష నాయక్, పోతుగంటి తిరుమల్, పోలేపల్లి సత్యం, జటావత్ రమేష్, పగడాల పెద్దిరాజు, దుబ్బ కోటేష్, శాగం కోటిరెడ్డి, మాజీ సర్పంచ్ వడిత కిరణ్, సలహాదారులు ఆంగోత్ కొట్యా నాయక్, సపావత్ స్వామి నాయక్, బాలాజీ బిచ్చా నాయక్, కంసాని పురుషోత్తం, వీరబోయిన మల్లికార్జున్, ఉపసర్పంచ్ జటావత్ మోతిలాల్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన పట్టభద్రులందరినీ ఎంఎల్‌సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇంచార్జ్ డా. బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి పిలుపు



**మిడ్జిల్ , అక్టోబర్ 10 (నేటి దర్శిని):** మక్తల్ నియోజకవర్గంలో అర్హులైన పట్టభద్రులందరినీ ఎంఎల్‌సీ ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మక్తల్ నియోజకవర్గ ఎంఎల్‌సీ ఎన్నికల ఇన్‌చార్జి డా. బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూర్, అమరచింత, ఉట్కూర్ మండలాల్లో పర్యటించి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. అనంతరం ఎడివెల్లి గ్రామ బీజేపీ కార్యకర్తల విజ్ఞప్తి మేరకు తన సొంత నిధులతో దసరా పండుగలోపు హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహ ఇన్‌చార్జి జిందే శ్రీనివాస్, ఆత్మకూర్ రూరల్ అధ్యక్షుడు అశోక్ భూపాల్, అమరచింత టౌన్ అధ్యక్షురాలు మంగా లావణ్య అంజన్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అంజి ముదిరాజ్, రేచింతల శ్రీనివాస్, లక్ష్మీకాంత్, బలవీర్, ఆంజనేయులు, నర్సింహ, పెంటన్న, నాగప్పతో పాటు బూత్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భగత్‌కు జన్మదిన కానుకగా ఫోటో ఫ్రేమ్ అందజేత



**పెద్దవూర, అక్టోబర్ 10 (నేటి దర్శిని):** నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నోముల భగత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దవూర మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆయనకు ఫోటో ఫ్రేమ్‌ను బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసే నాయకుడిగా, పేదల పక్షపాతిగా నోముల భగత్ కుమార్‌ను అభివర్ణిస్తూ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దవూర మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, చింతపల్లి సర్పంచ్ జటావత్ రవి నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు రమావత్ శ్రీకర్ నాయక్, ఉద్యోగ సంఘ నాయకుడు నడ్డి బాలరాజు యాదవ్, చింతపల్లి ఉపసర్పంచ్ జానపాటి ఎల్లయ్య యాదవ్, యువ నాయకులు రంజిత్ రెడ్డి, గొర్ల మహేష్ తదితరులు పాల్గొని నోముల భగత్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పశుసంవర్ధక శాఖ మరియు పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువుల గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం.



**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 10 (నేటి దర్శిని):**
రంగా రెడ్డి జిల్లా, ఫరూక్ నగర్ మండలం లోని గ్రామపంచాయతీ నాగులపల్లి పశుసంవర్ధక శాఖ మరియు పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువుల గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించడం జరిగినది.

శిబిరంలో ఎదకు వచ్చిన పాడి పశువులకు కృత్రిమ గర్భాధారణ చేయడం, ఎదకు రాని పశువులకు చికిత్స చేయడం, గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించడం, లేగదూడలు మరియు దుడ్డెలకు నట్టల నివారణ మందులు త్రాగించడం జరిగినది.సర్పంచ్ శ్రీ రాధిక అశోక్ రెడ్డి మాట్లాడుతూ పశు వైద్య శిబిరాన్ని పాడి రైతులు అందరూ వినియోగించుకోవాలి అని సూచించారు మరియు పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమ పాకెట్ లు అందించడం జరిగినది.

శిబిరం లో సహాయ సంచాలకులు షాద్ నగర్ డా.జి.విజయ్ కుమార్ రెడ్డి గారు,పశు వైద్య అధికారిని డా.కె. సునీత గారు ఉప సర్పంచ్ కిరణ్ కుమార్ గౌడ్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఆర్. అశోక్ కుమార్,గోపాల మిత్ర సూపర్వైజర్ బండ. వెంకటేష్, ఆఫీస్ సబ్ ఆర్డినేట్ డి.లక్ష్మీ నర్సింహా,గోపాల మిత్రులు జి.లక్ష్మణ్, జి . మహేష్ గ్రామ పెద్దలు, పాడి రైతులు పాల్గొనడం జరిగినది.

## కీసరలో చైన్ స్నాచింగ్.. వృద్ధురాలి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు అపహరణ...

### నాగారం అన్నపూర్ణ కాలనీలో ఘటన...



**నాగారం, అక్టోబర్ 10:- (నేటి దర్శిని):**
మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం అన్నపూర్ణ కాలనీలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. శనివారం శకుంతల (68) అనే వృద్ధురాలు తన కుమార్తె ఇంటికి వెళ్లేందుకు వస్తువులు సర్దుకుంటుండగా, వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. సమాచారం అందుకున్న కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి ఆచూకీ కోసం విచారణ కొనసాగిస్తున్నారు. కాగా, సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాలనీల్లో నిఘా పెంచి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## మల్కారం క్వారీలో విషాదం.. నీట మునిగి ఇంటర్ విద్యార్థి మృతి...

● దమ్మాయిగూడకు చెందిన 17 ఏళ్ల యువకుడు మృత్యువాత...



**నాగారం, అక్టోబర్ 10:- (నేటి దర్శిని):**
మల్కారం క్వారీలో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లాలోని కీసర మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది.

దమ్మాయిగూడ సాయిప్రియ కాలనీకి చెందిన ముమ్మారెడ్డి ప్రణవ్ సాయి (17) చేర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పటిలాగే అక్టోబర్ 9న కళాశాలకు వెళ్లిన ప్రణవ్ సాయి సాయంత్రం స్నేహితులతో కలిసి మల్కారం క్వారీ వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడు నీటిలో మునిగిపోయాడు.

సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ప్రణవ్ సాయి తల్లి హేమలతకు అతడి స్నేహితులు, పోలీసులు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో ఆమె హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్నేహితులను విచారించగా, అందరూ కలిసి ఈత కొడుతున్న సమయంలో ప్రణవ్ సాయి నీటిలో మునిగిపోయినట్లు తెలిపారు. పోలీసులు, రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టి నీటిలో నుంచి ప్రణవ్ సాయి మృతదేహాన్ని వెలికితీశారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనపై తల్లి హేమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



# గ్రీన్ పార్క్ కాలనీ అమృత రెసిడెన్సీలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

● సముద్రాల సంతోష్, సాయినాథ్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు
● తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆడపడుచుల ప్రత్యేక పూజలు

**ఎల్బీనగర్, అక్టోబర్ 10 (నేటి దర్శిని):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు గ్రీన్ పార్క్ కాలనీలోని అమృత రెసిడెన్సీలో ఘనంగా నిర్వహించారు. సముద్రాల సంతోష్, సాయినాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ పండుగ సందడిని నింపారు. తెలంగాణ ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ ఆడిన మహిళలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కాలనీలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళల సందడి, బతుకమ్మ పాటలతో పరిసరాలు మార్మోగాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు పుష్కలంగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. అమృత రెసిడెన్సీలో నిర్వహించిన ఈ వేడుకలు మహిళల్లో ఆనందోత్సాహాలను నింపాయి. పండుగలు సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు కుటుంబాలు, కాలనీవాసుల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో సముద్రాల సుష్మ, సముద్రాల జయలక్ష్మి, పద్మ, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేశారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల వైభవానికి బతకమ్మ పండగ ప్రతీక: ఎంపీ డాక్టర్ కడియం కావ్య

● పార్లమెంట్ నియోజకవర్గ మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ



**ఉమ్మడి వరంగల్, అక్టోబర్ 10 ( నేటి దర్శిని బ్యూరో):**
పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి, ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే తొమ్మిది రోజుల పూల పండుగను పురస్కరించుకుని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ప్రకృతిలోని ప్రతి పువ్వులో అందాన్ని, ప్రతి జీవిలో జీవన సౌందర్యాన్ని దర్శించే గొప్ప పండుగ బతుకమ్మ అని ఎంపీ పేర్కొన్నారు. ప్రకృతి ఒడిలో విరబూసే తీరొక్క పూలను సేకరించి, అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటలతో మహిళలు జరుపుకునే ఈ పండుగ తెలంగాణ అస్తిత్వానికి, మన సంస్కృతీ వైభవానికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు.బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, కుటుంబ బంధాలకు, ప్రకృతితో మనకున్న విడదీయలేని అనుబంధానికి ప్రతీక అని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఈ అద్భుతమైన సంప్రదాయాన్ని కాపాడుకుంటూ, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాలు ప్రతి ఇంటా ఆనందాన్ని, ప్రతి కుటుంబంలో సంతోషాన్ని, ప్రతి హృదయంలో కొత్త ఆశలను నింపాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు. పల్లెలు, పట్టణాలు పూల పరిమళాలతో, సంప్రదాయ గీతాలతో కళకళలాడాలని, మహిళలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు.ప్రకృతిని ప్రేమిస్తూ, మన సంస్కృతిని గౌరవిస్తూ, తెలంగాణ పండుగల గొప్పతనాన్ని చాటిచెప్పే బతుకమ్మ వేడుకలను ప్రజలందరూ కలిసికట్టుగా, సంతోషంగా జరుపుకోవాలని ఎంపీ పిలుపునిచ్చారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో బతుకమ్మ పూల పరిమళాల్లా సంతోషాలు విరబూయాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ మరోసారి ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.

# అభివృద్ధి పనులపై సీఆర్పీఎఫ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 10 (నేటి దర్శిని):**
మియాపూర్ డివిజన్ పరిధిలోని నడి గడ్డ తండా మరియు సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలలో గల సమస్యలపై మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై ఈ రోజు యూసఫ్ గూడ లోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ దక్షిణ విభాగం కార్యాలయంలో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ తుమ్మల విక్రమ్ ని తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో మర్యాదపూర్వకంగా కలిసి చర్చించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... నడిగడ్డ తండా మరియు సుభాష్ చంద్రబోస్ నగర్ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, నడిగడ్డ తండా లో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులకు అనుమతులు ఇవ్వాలని గాంధీ సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ తుమ్మల విక్రమ్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగినది .మియాపూర్ మెట్రో పిల్లర్ నంబర్ 600 నుండి మియాపూర్ మెట్రో స్టేషన్ వరకు సర్వీస్ రోడ్డు విస్తరణ లో భాగంగా సీఆర్పీఎఫ్ అధీనంలో ఉన్న స్థలంలో రోడ్డు వేయడానికి అనుమతులు ఇవ్వాలని,



రోడ్డు సగంలో ఆగిపోయింది అని , ప్రజలకు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి అని, పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని సర్వీస్ రోడ్డు వేయుటకు అనుమతులు ఇవ్వాలని ప్రయాణికులకు, వాహనదారులకు, ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగునని, రోడ్డు అందుబాటులోకి వస్తె ఎంతో ప్రయోజనం చేకూరుతుంది అని, ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుంది అని, ప్రజలకు సాంత్వన చేకూరుతుంది అని తెలియచేశారు.

నడిగడ్డ తండా నుండి ఎచ్డీఎఫ్సీ బ్యాంక్ బొల్లారం రోడ్డు పక్కన మురుగు నీరు చేరి వాహనదారులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులకు అనుమతులు ఇప్పిస్తే వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, మురుగు నీరు మళ్లింపు ద్వారా కాలనీ లో ప్రశాంతమైన వాతావరణం కల్పించడం జరుగుతుంది అని తెలియచేశారు.నడ్డిగడ్డ తండా లో ఎన్నో ఏండ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం త్వరలోనే చూపుతామని, నడిగడ్డ తండా అభివృద్ధికి కృషి చేస్తానని,నడిగడ్డ తండా లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, నడిగడ్డ తండా లో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను కూడా త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలియచేశారు.ఈ సందర్భంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ దక్షిణ విభాగం కార్యాలయంలో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ తుమ్మల విక్రమ్ గారు మాట్లాడుతూ తెలియచేసిన పై అంశాల పై సానుకూలంగా స్పందించడం జరిగినది.ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అధికారులు సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎస్ఈ శ్రీకాంతిని, ఏఈ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడాది తర్వాత శివయ్య ఆచూకీ లభ్యం

**● మానవత్వంతో అండగా నిలిచిన ఎండీ అజీమ్ స్వచ్ఛంద సంస్థ**



మిడ్జిల్, అక్టోబర్ 10,(నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో): ఏడాది కాలంగా కనిపించకుండా పోయిన శివయ్య ఆచూకీ లభించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కొత్తూరుకు చెందిన ఎండీ అజీమ్ స్వచ్ఛంద సంస్థ శివయ్యకు ఆశ్రయం కల్పించి, ఆలనా--పాలనా చూసుకోవడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ రామ్ చందర్ రాథోడ్, ఉపసర్పంచ్ సుందర్ రాజ్, కుటుంబ సభ్యులు కలిసి శివయ్యను గ్రామానికి తీసుకువచ్చారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్తులు సంస్థ సేవలను కొనియాడారు.

## వరంగల్ నూతన కలెక్టరేట్ భవనము ప్రారంభం ఎప్పుడో....!



ఉమ్మడి వరంగల్, అక్టోబర్ 10 ( నేటి దర్శిని బ్యూరో): వరంగల్ జిల్లా లో కలెక్టరేట్ భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభించకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాల విభజన తర్వాత వరంగల్ జిల్లా కలెక్టరేట్ ను హనుమకొండ నక్కల గుట్ట లోని ఇరిగేషన్ భవనంలో కలెక్టరేట్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కలెక్టరేట్ భవనములో జిల్లా పరిధిలోని అన్ని శాఖలకు కార్యాలయాలు ఉండాలని ఆశయముతో నిర్మాణాలు చేపట్టారు. అన్ని శాఖల అధికారులతో వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రజలకు పనులు సులభతరం అవుతాయని నిర్మాణం చేపట్టారు. వరంగల్ జిల్లాలో నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభం కాకపోవడంతో వివిధ శాఖ లు, వివిధ ప్రాంతాల్లో ఉండడం వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. వరంగల్ ఆజం జాహి గ్రౌండ్స్ లో కలెక్టరేట్ భవనము పూర్తయినప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా దసరా, దీపావళి పండగలనాటికైనా జిల్లా కలెక్టర్ నూతన భవనం ప్రారంభమవుతుందా అని జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు. త్వరలో కలెక్టర్ భవనం ప్రారంభించి ప్రజలకు అందించాలని కోరుతున్నారు.

## బతుకమ్మ పండగను మహిళలు ఆనందోత్సవాలతో జరుపుకోవాలి: జిల్లా కలెక్టర్



ఉమ్మడి వరంగల్, అక్టోబర్ 10 (నేటి దర్శిని బ్యూరో): తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిగా నిలిచే బతుకమ్మ పండగను మహిళలంతా ఆనందోత్సవాలతో జరుపుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంగిలి పూల బతుకమ్మ పండుగకు మహిళలకు శుభాకాంక్షలు తెలిపా రు. ప్రకృతిని పూజించే ఈ పండుగ ప్రతి ఇంట్లో ఆనందం ఐశ్వర్యం సంతోషాన్ని నింపాలని కోరుకున్నారు .విశిష్టత కలిగిన ఈ మహా వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## తెలంగాణలోని ఆడపడుచులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

**● కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య**



మిడ్జిల్ మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య

మిడ్జిల్, అక్టోబర్ 10, (నేటి దర్శిని): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య మహిళలందరికీ హృదయపూర్వక బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజులపాటు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా అలంకరించి కుటుంబ సభ్యులు, స్నేహితులు, మహిళలందరూ కలిసి ఆటపాటలతో, సంప్రదాయ బతుకమ్మ పాటలతో ఈ పండుగను జరుపుకోవాలని కోరారు. బతుకమ్మ పండుగ తెలంగాణలోని ప్రతి ఇంటా సంతోషాలు, సౌభాగ్యాలు, సిరి సంపదలతో నింపాలని, మహిళలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# బతుకమ్మ,దసరా పండుగల వేళ ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**● దొంగతనాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి: జిల్లా ఎస్పీ**



మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి ఐపిఎస్

మిడ్జిల్, మహబూబ్‌నగర్, అక్టోబర్ 10 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో): బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగల సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారు దొంగతనాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంటి భద్రత కోసం ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి 1. ఇంటి ప్రధాన ద్వారాలు, వెనుక ద్వారాలు, కిటికీలకు పటిష్టమైన తాళాలు వేయాలి. 2.నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచాలి. 3.ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని, ప్రయాణ వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదు. 4.నమ్మకమైన ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇచ్చి ఇంటిపై నిఘా ఉంచేలా చూడాలి. 5. వీలైతే సీసీటీవీ కెమెరాలు, భద్రతా అలారాలు ఏర్పాటు చేసుకోవాలి. 6.వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్కింగ్ చేసి, అదనపు భద్రతా పరికరాలు వినియోగించాలి. 7.అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అనుమానితులను మీరే ఎదుర్కోవద్దు. ప్రజల భద్రతకు జిల్లా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని ఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు.పోలీస్ కంట్రోల్ రూమ్: 8712659360 పోలీస్ అత్యవసర సహాయం: డయల్ 112 మీ భద్రతే మా బాధ్యత దొంగతనాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకం.

# నిడమనూరు వార్డు మెంబర్ల ఫోరం నూతన కమిటీ ఎన్నిక





నిడమనూరు, అక్టోబర్ 10 (నేటి దర్శిని): నిడమనూరు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో వార్డు మెంబర్ల ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కోఆర్డినేటర్ పోగుల నాగార్జున రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిడమానూరు మండల ఫోరం అధ్యక్షుడిగా అల్లంపల్లి వెంకటేశ్వర్లు, సలహాదారుడిగా బూరుగు నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గోలి శారద, మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఆది మల్ల భాస్కర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బండారు సతీష్ కుమార్, ముడి శ్రీలేఖ రాజేందర్, గుడిసె శంకరయ్య, నందికొండ ఏడుకొండలు, సహాయ కార్యదర్శులుగా చరిక సర్వయ్య, జిల్లా పెద్ద నరసయ్యలను ఎన్నుకున్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా నడింపల్లి పార్వతమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిల్లి సైదమ్మ, ప్రధాన కార్యదర్శిగా చిత్రం లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా ఆవుల రమణ, సహాయ కార్యదర్శిగా కోమటి పార్వతమ్మ ఎన్నికయ్యారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా మేకల పవన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండేటి నవీన్‌తో పాటు పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పోగుల నాగార్జున రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో వార్డు మెంబర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వార్డు మెంబర్లకు నెలకు రూ.3,000 గౌరవ వేతనం అందించాలని, ప్రత్యేక ఆరోగ్య కార్డు మంజూరు చేయాలని, వార్డు మెంబర్ మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలపై వార్డు మెంబర్ల పేర్లు నమోదు చేయాలని కోరారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు అందరూ కలిసి పోరాడాలని ఆయన అన్నారు.

# తీదేడులో బతుకమ్మ సంబరాలు

**● రామాలయం వద్ద ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు**

**● తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి**

**● సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి**

చింతపల్లి అక్టోబర్ 10( నేటి దర్శిని) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జరుపుకోవాలని, తరతరాలుగా వస్తున్న ఆచారాలను భావితరాలకు అందించాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని రామాలయం వద్ద శుక్రవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు.

**పూలతో బతుకమ్మలు.. ఆటపాటలతో సందడి**

ఈ సందర్భంగా గ్రామ మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల ఆటపాటలతో రామాలయం పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. గ్రామంలో ఎటుచూసినా పండుగ వాతావరణం నెలకొంది.



**సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత**

ఈ సందర్భంగా సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ జరుపుకునే ఈ పండుగ మహిళల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. మన పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ, వాటి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాలని సూచించారు. బతుకమ్మ పండుగ మహిళల జీవితాల్లో ఆనందాన్ని నింపడమే కాకుండా తెలంగాణ గ్రామీణ సంస్కృతి వైభవాన్ని చాటిచెబుతుందని అన్నారు. తీదేడు గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో గ్రామ పాలకవర్గ సభ్యులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కిరాయి ఇంటి కష్టాలకు చెక్..
# సొంతింట్లో ఆత్మగౌరవం!

● వికలాంగ దంపతుల కల నెరవేర్చిన ఇందిరమ్మ ఇల్లు
● గొల్లపల్లిలో అనంతుల కృష్ణయ్య--సైదమ్మ దంపతుల జీవితాల్లో కొత్త వెలుగులు



**చింతపల్లి, అక్టోబర్ 10 ( నేటి దర్శిని ):** ఎనిమిదేళ్లుగా కిరాయి ఇంట్లో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న వికలాంగ దంపతుల సొంతింటి కల ఎట్టకేలకు నెరవేరింది. చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన అనంతుల కృష్ణయ్య, సైదమ్మ దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ప్రస్తుతం సొంతింట్లో నివసిస్తున్నారు. తమకంటూ ఓ ఇల్లు ఉండాలన్న చిరకాల కోరిక నెరవేరడంతో దంపతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఎనిమిదేళ్ల కిరాయి కష్టాలకు విముక్తి**

కృష్ణయ్య, సైదమ్మ దంపతులకు వివాహమై పదేళ్లు పూర్తయ్యాయి. గత ఎనిమిదేళ్లుగా కిరాయి ఇంట్లో నివసిస్తూ ఇంటి అద్దె, రోజువారీ అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇద్దరూ దివ్యాంగులు కావడంతో ఆర్థిక పరిస్థితులు మరింత భారంగా మారాయి. సొంత ఇల్లు నిర్మించుకోవాలన్న ఆశ ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేక కల నెరవేరడం కష్టంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడంతో వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయి.

**పేదల ఆత్మగౌరవానికి చిరునామా**

ఇందిరమ్మ ఇల్లు తమకు కేవలం నివాసం మాత్రమే కాదని, ఆత్మగౌరవంతో జీవించేందుకు భరోసా కల్పించిందని దంపతులు పేర్కొంటున్నారు. గతంలో ప్రతి నెలా ఇంటి అద్దె చెల్లించాల్సి వచ్చేదని, ప్రస్తుతం సొంతింట్లో ప్రశాంతంగా జీవించే అవకాశం లభించిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**సంక్షేమ పథకాలతో అదనపు భరోసా**

ఇందిరమ్మ ఇంటితో పాటు తమ కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు కావడం ఉపయోగకరంగా మారిందని కృష్ణయ్య--సైదమ్మ దంపతులు తెలిపారు. సన్నబియ్యం పథకం ద్వారా ఆహార భద్రతకు తోడ్పాటు లభిస్తోందని పేర్కొన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే గృహజ్యోతి పథకం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి పథకాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

**గ్రామ సర్పంచ్ అనంతుల శ్రీనివాస్ గౌడ్**

గొల్లపల్లి గ్రామ సర్పంచ్ అనంతుల శ్రీనివాస్ గౌడ్. గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందడం గ్రామాభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతుంది. కృష్ణయ్య--సైదమ్మ దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైన అంశం ఈ నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ కుటుంబానికి ప్రయోజనం చేకూరిందని దంపతులు హర్షం వ్యక్తం చేశారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ నాయకత్వంలో అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందాలని ఆకాంక్షించారు.

కిరాయి ఇంటి కష్టాల నుంచి సొంతింటి ఆత్మగౌరవం వరకు సాగిన కృష్ణయ్య--సైదమ్మ దంపతుల ప్రయాణం పేద కుటుంబాలకు గృహ భద్రత ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది.

# ఆడపడుచులందరికీ ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు

● తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవమే బతుకమ్మ
● మహిళల ఐక్యతకు.. ఆత్మగౌరవానికి ప్రతీక
● కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి। చింతపల్లి మాజీ జడ్పీటీసీ



**చింతపల్లి అక్టోబర్ 10 (నేటి దర్శిని) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని ఆడపడుచులందరికీ నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్, చింతపల్లి మాజీ జడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతుందని అన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను కాపాడుకుంటూ, మన సంస్కృతి వైభవాన్ని భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

**ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలి**

తెలంగాణ ఆడపడుచులందరూ ఎంగిలిపూల బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ పూల పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలను నింపాలని, మహిళలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు.

# దసరా వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

● మండపాల నిర్వాహకులు పోలీస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి: ఎస్పీ డి.జానకి

**మిడ్జిల్,అక్టోబర్ 10 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** దుర్గామాత నవరాత్రులు, విజయదశమి వేడుకలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలిపారు. దుర్గామాత మండపాలు, దేవాలయాలు, రావణ దహనం జరిగే ప్రాంతాలు, ప్రజలు అధికంగా గుమిగూడే ప్రదేశాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మండపాల నిర్వాహకులు తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, 24 గంటలపాటు ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల ఏర్పాటు వల్ల ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకూడదని స్పష్టం చేశారు. మండపాల వద్ద, శోభాయాత్రల్లో డీజేలకు అనుమతి లేదని పేర్కొన్నారు. అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, పిల్లల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు, మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి దసరా వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలీస్ పోర్టల్: https://policeportal.tspolice.gov.in/




# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
## - డీఎస్పీ శ్రీనివాసరావు




**దేవరకొండ అక్టోబర్ 10 (నేటి దర్శిని)** నల్లగొండ జిల్లాలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం తెలిపారు.దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో జరిగిన ప్రెస్ మీట్ లో డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వనపర్తి, హైదరాబాద్ కు చెందిన నలుగురు దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి సుమారు రూ. 21 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు, బైకులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.నిందితులు రెక్కీ నిర్వహించి తాళం వేసి ఉన్న ఇళ్లలో, రద్దీగా ఉన్న బస్టాండ్లలో, బ్యాంకుల వద్ద ఎవరు డబ్బులు డ్రా చేస్తున్నారు దొంగలు నిగా వేసి చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ ముఠాపై మర్రిగూడ, చింతపల్లి, గుర్రంపోడు, దేవరకొండ, కనగల్, నకిరేకల్ పోలీస్ స్టేషన్లలో 9 కేసులు నమోదైనట్లు తెలిపారు.పట్టుబడిన నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్ కు తరలించామని, డీఎస్పీ తెలిపారు. చోరీల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లకు తాళం వేసి వెళ్లేటప్పుడు ప్రజలు, ప్రయాణికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# 17న 'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ - 2026

**పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు**




**ఉమ్మడి వరంగల్, అక్టోబర్ 10 (నేటి దర్శిని బ్యూరో):** క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతోహనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్‌లో విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 17న 'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ -- 2026, ఎడిషన్ 02' నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ పోస్టర్ ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హన్మకొండ కిషన్ పురలోని వారి నివాసంలో విష్ణువర్ధన్ రెడ్డి తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 21 కిలోమీటర్ల టైమ్డ్ రన్, 10 కిలోమీటర్ల పరుగు, 5 కిలోమీటర్ల ఫన్ రన్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. వివిధ వయసుల వారు, క్రీడాభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 17వ తేదీన కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్‌లో ప్రారంభమై, అదే ప్రాంగణంలో ముగియనున్న ఈ మారథాన్‌లో పాల్గొనాలనుకునే వారు ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ సయ్యద్ ఇంతియాజ్, ఆరేపల్లి మాజీ పాక్స్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుద్దే పెద్దన్న,14 డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో పూల పండుగ సందడి.. ఘనంగా బతుకమ్మ వేడుకలు



**యాచారం, అక్టోబర్ 10 (నేటి దర్శిని) :** తెలంగాణ పూల పండుగ బతుకమ్మ వేడుకలు కొత్తపల్లి గ్రామంలో శనివారం కన్నుల పండుగగా జరిగాయి. గ్రామంలోని మహిళలు, యువతులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి జానపద గీతాలను ఆలపిస్తూ, ఆటపాటలతో సందడి చేశారు.రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలకు అనుగుణంగా ఆడిపాడటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, ప్రకృతి ఆరాధన, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.గ్రామంలో వేడుకలు సజావుగా జరిగేందుకు గ్రామ పాలకవర్గం అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా మహిళలు, గ్రామస్థులు ఆనందోత్సాహాలతో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ చిక్కుడు వెన్నెల శేఖర్, ఉపసర్పంచ్ కాలే అనిత రమేష్, గ్రామ పాలకవర్గ సభ్యులు, మహిళలు, యువత పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఘనంగా మేనేజ్ 10వ స్నాతకోత్సవం

### వ్యవసాయ వ్యాపార నిర్వహణలో నూతన నిపుణులుగా పట్టభద్రులు






**హైదరాబాద్, అక్టోబర్ 10 (నేటి దర్శిని):** హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్) 2024--26 బ్యాచ్‌కు సంబంధించిన 10వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ నిర్వహణ రంగంలో మూడు దశాబ్దాలుగా మేనేజ్ కొనసాగిస్తున్న విశిష్ట సేవలకు ఈ కార్యక్రమం మరో మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా విజయాలను గుర్తిస్తూ, వారి వృత్తిపరమైన ప్రస్థానానికి నాంది పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీ (అడ్మినిస్ట్రేషన్ అండ్ జనరల్ కేటగిరీ, ఎక్స్‌టెన్షన్ అండ్ పల్సెస్ మిషన్), అలాగే మేనేజ్ హైదరాబాద్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సంజయ్ కుమార్ అగర్వాల్, ఐఏఎస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పి.జి.డి.ఎం (ఏబీఎం) కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు డిప్లొమాలను ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలను అందజేసి అభినందించారు. అనంతరం స్నాతకోత్సవ ప్రసంగం చేస్తూ, విద్యార్థుల విద్యా ప్రస్థానంలోని విజయాలను గుర్తించి, వారి భవిష్యత్ వృత్తి జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ రంగం, అగ్రి-బిజినెస్ నిర్వహణలో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దడంలో మేనేజ్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ స్నాతకోత్సవం ద్వారా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు తమ జ్ఞానం, నైపుణ్యాలను వ్యవసాయ రంగ అభివృద్ధికి వినియోగించుకునే దిశగా ముందడుగు వేశారు.

# మేడిపల్లి సత్యనారాయణపురం కాలనీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- మహిళల ఆటపాటలతో సందడిగా మారిన దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం




**మేడిపల్లి, అక్టోబర్ 10 (నేటి దర్శిని):** ఉప్పల్ జోన్, బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి సత్యనారాయణపురం కాలనీలో బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలనీలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవాలయం వద్ద జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. మహిళల ఆటపాటలు, బతుకమ్మ పాటలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కాలనీ మహిళలు ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకలతో సత్యనారాయణపురం కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది.

# రాంపల్లి చౌరస్తా వద్ద ఘోర ప్రమాదం.. యువకుడు మృతి..

### వెనుక నుంచి గ్యాస్ లారీ ఢీ.. 20 ఏళ్ల అఖిల్ మృతి...




**నాగారం, అక్టోబరు 10:- (నేటి దర్శిని):** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి చౌరస్తా వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నాగారం నివాసి చెన్నూరి అఖిల్ (20)ను వెనుక నుంచి గ్యాస్ లారీ ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.. చిన్న వయసులోనే అఖిల్ మృతిచెందడంతో నాగారంలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాదానికి గల కారణాలు, ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

# రామ రామ రామ ఉయ్యాలో రాముని శ్రీరామ ఉయ్యాలో





- బతుకమ్మ పాటలతో మార్మోగిన పట్టణం
- తీరొక్క పూలతో అలంకరించి ఉత్సాహంగా వేడుకలు
- మహిళలు, యువతుల సందడి తో కోలాహలం



**ఆమనగల్లు , అక్టోబర్ 10 (నేటి దర్శిని):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు ఆమనగల్లులో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బతుకమ్మ పండుగలో తొలి రోజైన ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు.వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు మహిళలు, చిన్నారులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో శివ సేన మహిళా కమిటీ ఆధ్వర్యంలో పేర్చిన పదమూడు అడుగుల పూలతో అలంకరించిన బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి హాజరై దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మహిళలు, యువతులు అంగడీ బజార్ లోని హనుమాన్ దేవాలయం వద్ద బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. అనంతరం ఆమనగల్లు సుర సముద్రంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్ పర్సన్ గీత, కమీషనర్ రాఘవేందర్ రెడ్డి,సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై సంతోష్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివలింగం, కౌన్సిలర్లు ముక్తాల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్,పాపిశెట్టి రాము, నాగిళ్ల జగన్,భాగ్యలక్ష్మి, అనూష, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కో ఆప్షన్ సభ్యులు చుక్క అల్లాజీ గౌడ్, కండే సీతమ్మ, ఖాదర్, సత్యం, కృష్ణ నాయక్, మెకానిక్ బాబా, శేఖర్,సురేష్, ప్రసాద్,ఫరీద్, శ్రీకాంత్, మహేష్,శివ, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు, మహిళలు, పోలీస్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక అక్రమ రవాణా కేసులో పోలీసుల మెరుపు దాడి..

- 24 గంటల్లోనే ఎనిమిది మంది నిందితుల అరెస్ట్..
- ఆరు సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం
- ఆహారం, వసతి పేరుతో బాలికకు మాయమాటలు..
- వ్యభిచార గృహానికి తరలించి రూ.30 వేలతో బేరం




**హైదరాబాద్, అక్టోబర్10 (నేటి దర్శిని):** మైనర్ బాలికను అపహరించి, అక్రమంగా తరలించి, బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టిన కేసులో టోలిచౌకి పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, కేసు నమోదు చేసిన అనంతరం నిందితులను గుర్తించి, 24 గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

**ఆహారం, వసతి పేరుతో మోసం**

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. సెప్టెంబర్ 2, 2026న షేక్ ఆతిఫ్ అనే నిందితుడు టోలిచౌకి నుంచి టీఎస్ 30 టీ 8350 నంబరు గల ఆటోలో మైనర్ బాలికను తీసుకెళ్లాడు. ముందస్తు పథకం ప్రకారం అత్తాపూర్ ప్రాంతానికి తరలించి, సనా అలియాస్ ఆఫ్రీన్, సమ్రీన్ బేగం అనే ఇద్దరు మహిళలకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మంచి ఆహారం, వసతి కల్పిస్తామని బాలికను నమ్మించిన ఆ ఇద్దరు మహిళలు, అత్తాపూర్‌లోని పిల్లర్ నంబరు 200 సమీపంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న సబియా బేగంకు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇందుకు ప్రతిఫలంగా రూ.30 వేలు తీసుకుని, ఆ మొత్తాన్ని తమ మధ్య పంచుకున్నట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు.

**బలవంతంగా లైంగిక దోపిడీ**

బాలికను వ్యభిచారంలోకి బలవంతంగా నెట్టినట్లు, ఆమెను విడిచిపెట్టాలని వేడుకున్నప్పటికీ పట్టించుకోకుండా పలువురితో లైంగిక దోపిడీకి గురిచేసినట్లు పోలీసుల వివరాలు వెల్లడిస్తున్నాయి. మరో ముగ్గురు నిందితులు కస్టమర్లను తీసుకురావడం, అవసరమైన వసతులు కల్పించడంలో సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో బాధిత బాలిక అక్టోబర్ 5న వ్యభిచార గృహం నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుంది. తనకు జరిగిన అన్యాయాన్ని కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు టోలిచౌకి పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**ఎనిమిది మంది అరెస్ట్.. కొనసాగుతున్న దర్యాప్తు**

ఈ కేసులో షేక్ ఆతిఫ్, సబియా బేగం, మహమ్మద్ హాజీమియా, ఆఫ్రీన్ అలియాస్ సనా, సమ్రీన్ బేగం, ఎండీ నదీమ్, ఎండీ కైఫుద్దీన్, అలీ బిన్ అక్రమ్‌లను అక్టోబర్ 9న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్లతో పాటు పోక్సో చట్టం, అనైతిక రవాణా నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. మైనర్ బాలికలను అక్రమంగా తరలించి లైంగిక దోపిడీకి గురిచేయడం ద్వారా డబ్బు సంపాదించడమే నిందితుల లక్ష్యంగా ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. నిందితుల పాత్ర, ఆర్థిక లావాదేవీలపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి పర్యవేక్షణలో, టోలిచౌకి డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫియాజ్ మార్గదర్శకత్వంలో టోలిచౌకి ఇన్‌స్పెక్టర్ ఎల్. రమేష్ నాయక్, అదనపు ఇన్‌స్పెక్టర్ జి. బలరాజ్, ఎస్‌ఐ ఎస్. రవికుమార్, పోలీసు సిబ్బంది ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించారు.

# ప్రజల తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం..

### స్వంత నిధులతో బోరు వేయించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 10(నేటి దర్శిని):** జిల్లేడు చౌదరిగూడ మండలం వీరన్నపేటలోని మైనారిటీ వార్డులో తాగునీటి సమస్యపై స్థానిక ప్రజలు చేసిన విజ్ఞప్తికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తక్షణమే స్పందించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తన స్వంత నిధులతో బోరు వేయించి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.పదవిలో ఉన్నా.. లేకున్నా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, వారి కష్టాల్లో అండగా నిలవడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. అంజయ్య యాదవ్ చూపిన చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావలి సుమలత వెంకట్రాములు, వార్డు సభ్యులు సత్యం గౌడ్, కుమ్మరి శేఖర్, గంగంపుత్ర సంఘం అధ్యక్షుడు మురళీ, మండల సీనియర్ నాయకులు ఎం. నర్సిములు, సలీం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎండీ జహంగీర్, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు కావలి నరేష్, ఉపాధ్యక్షుడు రెడ్డి నరేష్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఎండీ అమీర్, సోహెల్, ఖాజా పాషా, ఐదవ వార్డుకు చెందిన మొకత్యార్, గులాం, దస్తగిరి, రఫీక్, మోసిన్, బురాన్, యూసుఫ్, కుక్కల బాలయ్య, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.



షార్ట్‌స్కర్ట్‌లో అదరగొడుతున్న ఆషికా రంగనాథ్.

# 'జై హనుమాన్'లో మమితా బైజు..

## -రిషబ్ శెట్టి, రానా సరసన కీలక పాత్రలో కనిపించనుందా?



మలయాళ ముద్దుగుమ్మ మమితా బైజు టాలీవుడ్‌లోనూ మంచి క్రేజ్ సంపాదించుకుంటోంది. 'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ భామ.. తన సహజమైన నటన, అందం, చలాకీతనంతో యువతను ఆకట్టుకుంది. దీంతో ఆమెకు ఇతర భాషల్లోనూ వరుస అవకాశాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మమితా బైజుకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'జై హనుమాన్'లో ఆమె కీలక పాత్రలో నటించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దర్శకుడు ప్రశాంత్ వర్మ రూపొందించిన 'హనుమాన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటించిన ఈ సూపర్‌హీరో చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో ఈ కథా ప్రపంచాన్ని మరింత విస్తరిస్తూ రూపొందిస్తున్న 'జై హనుమాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఈ సీక్వెల్‌లో మమితా బైజు ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తాజాగా ప్రచారం సాగుతోంది. కథలో భావోద్వేగాలకు ప్రాధాన్యమున్న పాత్ర కోసం చిత్ర బృందం ఆమెను సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావల్సింది. ఇక 'జై హనుమాన్' చిత్రానికి సంబంధించి ఇప్పటికే పలు ఆసక్తికరమైన వార్తలు తెరపైకి వచ్చాయి. 'కాంతార'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రిషబ్ శెట్టి ఈ చిత్రంలో హనుమంతుడి పాత్ర పోషించనున్నట్లు సమాచారం. అలాగే దగ్గుబాటి రానా కూడా ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మమితా బైజు కూడా సినిమాలో భాగమైతే, విభిన్నమైన నటీనటులతో కూడిన భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌కు మరింత ఆకర్షణగా మారనుంది. పురాణ నేపథ్యం, ఆధునిక కథన శైలి, భారీ దృశ్యాలు, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను రూపొందించేందుకు దర్శకుడు ప్రశాంత్ వర్మ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.మమితా బైజుకు 'ప్రేమలు' సినిమా మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఈ చిత్రంలో ఆమె నటన, తెరపై కనిపించిన సహజత్వం యువ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో మలయాళ చిత్ర పరిశ్రమతో పాటు ఇతర భాషల్లోనూ ఆమెకు అవకాశాలు పెరుగుతున్నాయి. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తన నటనకు మరింత పదును పెట్టుకుంటున్న మమితా.. భారీ స్థాయి పాన్ ఇండియా చిత్రంలో నటిస్తే ఆమె కెరీర్‌కు మరో కీలక మలుపు కావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే 'జై హనుమాన్'లో ఆమె పాత్రకు సంబంధించిన వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. 'జై హనుమాన్' చిత్రంపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'హనుమాన్' సాధించిన విజయంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. ఇప్పుడు మమితా బైజు పేరు కూడా తెరపైకి రావడంతో ఈ వార్తపై సినీ అభిమానులు ఆసక్తి చూపిస్తున్నారు.

# ఇతరుల జీవితాలపై కామెంట్స్ చేయడానికి మీరెవరు..

## -మృణాల్ ఠాకూర్ సీరియస్



సినీ తారల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, రూపురేఖలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేయడం ఈ మధ్యకాలంలో ఎక్కువైంది. ముఖ్యంగా హీరోయిన్లు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై పలువురు సినీ ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బాలీవుడ్ నటి, 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ కూడా ఇదే అంశంపై ఘాటుగా స్పందించారు. కత్రినా కైఫ్, కృతి సనన్‌లను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న విమర్శలను తప్పుబడుతూ, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను గౌరవించాలని హితవు పలికారు.తన తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ ఆన్‌లైన్ ట్రోలింగ్ గురించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత నిర్ణయాలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె అభిప్రాయపడ్డారు.కత్రినా కైఫ్, కృతి సనన్ వంటి నటీమణులు సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. వారి విజయాలను, కష్టాన్ని మరిచిపోయి చిన్న చిన్న విషయాలపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ప్రతి అంశంలోనూ ఇతరులను తప్పుపట్టడం మానుకోవాలని, సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే జనాలకు పిచ్చి పట్టినట్టుగా అనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇటీవల కత్రినా కైఫ్ ఓ వేడుకలో పాల్గొన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ ఫొటోల్లో ఆమె శారీరక రూపురేఖలపై కొందరు నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తల్లి అయిన తర్వాత శరీరంలో సహజంగా వచ్చే మార్పులను కూడా కొందరు విమర్శించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఒక మహిళ శరీరంలో వచ్చే మార్పుల ఆధారంగా ఆమెను అంచనా వేయడం, బహిరంగంగా అవమానించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఈ ఘటనతో మరోసారి తెరపైకి వచ్చాయి. మరోవైపు, నటి కృతి సనన్ కూడా ఓ ప్రకటనలో ధరించిన దుస్తుల కారణంగా విమర్శలు ఎదుర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా విడుదలైన ఓ నగల ప్రకటనలో ఆమె ధరించిన దుస్తులపై కొందరు నెటిజన్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఆ దుస్తులు పండుగ సందర్భానికి తగినవి కావంటూ విమర్శలు రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ వివాదం నేపథ్యంలో సదరు ప్రకటనను తొలగించారు.. తన ఉద్దేశం ఎవరి మనోభావాలను దెబ్బతీయడం కాదని కృతి సనన్ వివరణ ఇచ్చింది. కాగా, సామాజిక మాధ్యమాల్లో మహిళలతో పాటు పురుషులు కూడా ఇలాంటి విమర్శలను ఎదుర్కొంటున్నారని మృణాల్ ఠాకూర్ అభిప్రాయపడ్డారు. అయితే మహిళల దుస్తులు, శరీరాకృతి, వ్యక్తిగత నిర్ణయాలపై తరచూ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం ఆందోళన కలిగిస్తుంది.

# అవన్నీ టైంపాస్ ముచ్చట్లు!



సోషల్‌మీడియాలో తన పారితోషికం గురించి వస్తున్న రూమర్స్‌పై కథానాయిక శ్రీనిధి శెట్టి స్పందించింది. ఒక్కో సినిమాకు తాను 8కోట్ల వరకు పారితోషికం అందుకుంటున్నాననే ప్రచారం జరుగుతున్నదని, అందులో నిజంలేదని స్పష్టం చేసింది. 'నేను చేసిన సినిమాలే చాలా తక్కువ. అలాంటప్పుడు అంత పెద్ద మొత్తంలో డబ్బులు ఎవరిస్తారు? ఎవరో కొందరు టైంపాస్ కోసం ఇలాంటి రూమర్స్‌ను వ్యాప్తి చేస్తుంటారు. వాటిని అస్సలు పట్టించుకోవద్దు' అని శ్రీనిధిశెట్టి వివరణ ఇచ్చింది.ఒకవేళ డబ్బు తనకు ప్రధానమైతే ఇప్పటికే ఓ ముప్పై చిత్రాల్ని అంగీకరించేదాన్నని, కెరీర్ ఆరంభం నుంచి మంచి కథలకే ప్రాధాన్యం ఇస్తూ సినిమాల్ని ఎంపిక చేసుంటున్నానని ఈ భామ తెలిపింది. 'కేజీఎఫ్' ఫ్రాంచైజీ చిత్రాలతో దేశవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువైంది శ్రీనిధి శెట్టి. ఆ తర్వాత తెలుగులో హిట్-3, తెలుసు కదా వంటి చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం ఈ కన్నడ సొగసరి వెంకటేష్‌తో కలిసి 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటించింది. త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది.

# 'దృశ్యం 3' బాక్సాఫీస్ సునామీ..



బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగన్ నటించిన సంచలన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'దృశ్యం 3: ది కన్‌క్లూజన్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ సినిమా, కేవలం 8 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్ల మార్క్‌ను దాటేసింది. రెండో శుక్రవారం రోజే భారత్‌లో రూ. 14.50 కోట్లు రాబట్టడంతో, ప్రపంచవ్యాప్త గ్రాస్ కలెక్షన్లు రూ. 407 కోట్లకు చేరుకున్నాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, దీనితో మన దేశంలోనే సినిమా మొత్తం గ్రాస్ కలెక్షన్లు రూ. 312 కోట్లకు, నెట్ కలెక్షన్లు రూ. 260 కోట్లకు చేరాయి. ఇక విదేశీ మార్కెట్లలో (ఓవర్సీస్) శుక్రవారం నాటికి మరో రూ. 6 కోట్లు రావడంతో, అంతర్జాతీయ వసూళ్లు రూ. 95 కోట్లకు పెరిగాయి.విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే రూ. 27 కోట్లు రాబట్టిన ఈ చిత్రం, అజయ్ దేవగన్ కెరీర్‌లో బిగ్గెస్ట్ ఓపెనింగ్‌గా నిలిచింది. ఇక ఫస్ట్ వీకెండ్‌లో శనివారం రూ. 53.50 కోట్లు, ఆదివారం రూ. 61 కోట్లతో ఊహించని వసూళ్లు సాధించింది. తొలి వారం ముగిసేసరికి ఇండియాలోనే రూ. 245.50 కోట్ల నెట్ కలెక్షన్లను సొంతం చేసుకుంది. వీకెండ్స్ తర్వాత వర్కింగ్ డేస్‌లో కూడా కలెక్షన్లు తగ్గకపోవడం విశేషం. అజయ్ దేవగన్ కెరీర్‌లో ఇప్పటివరకు అత్యధిక వసూళ్లు సాధించిన 'తానాజీ: ది అన్‌సంగ్ వారియర్' (2020) చిత్రం డొమెస్టిక్ నెట్ కలెక్షన్ రూ. 279.59 కోట్లుగా ఉంది. ప్రస్తుతం 'దృశ్యం 3' నెట్ కలెక్షన్ రూ. 260 కోట్లకు చేరడంతో, ఆ రికార్డును అధిగమించడానికి కొద్ది దూరంలోనే ఉంది. సినిమా కలెక్షన్లు చూస్తుంటే త్వరలోనే 'తానాజీ' రికార్డు బద్దలవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టబు, ప్రకాష్ రాజ్, జైదీప్ అహ్లావత్ మరియు శ్రియా సరన్ ప్రధాన తారాగణంగా నటించారు. స్టార్ స్టూడియో 18 మరియు పనోరమ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365